సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం। 15। ఫిబ్రవరి। 2023



వెండి చీరకు విరాళాలు

తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలమ్మ వెండి చీర కోసం అయ్యప్ప దంపతులు రూ.10,116, వి.రాంబాబు దంపతులు 49 గ్రాముల వెండిని అందజేశారు.



మావుళ్లమ్మ హుండీ లెక్కింపు

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ వారి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించగా 34 రోజులకు రూ.79,22,173 ఆదాయం వచ్చింది.



మహారుద్రయాగం

తాడేపల్లిగూడెం రూరల్: నీలాద్రిపురం శ్రీ ఉమాచంద్రశేఖర స్వామి ఆలయంలో మంగళవారం మహారుద్రయాగం మొదలైంది. 18 వరకు యాగం నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

లక్ష్మీపురంలో వెంకయ్య నాయుడు పర్యటన



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు వెంకటేశ్వరస్వామి చిత్రపటం బహూకరణ

దెందులూరు: ఏలూరు జిల్లా పెదవేగి మండలంలోని వంగూరు, లక్ష్మీపురంలోని ప్రైవేటు కార్యక్రమానికి మంగళవారం భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు విచ్చేశారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆయనకు స్వాగతం పలికారు. వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. స్థానికుల విద్య, వైద్యం, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, పెదవేగి ఎంపీపీ తాతా రమ్య, రాట్నాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ చల్లగోళ్ళ వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు మెట్లపల్లి సూరిబాబు, దెందులూరు మండల వైస్ ప్రెసిడెంట్ వేమూరి జితేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశిన సతీష్ , పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, బీజేపీ రాష్ట్ర , జిల్లా నాయకులు ఎస్.మాలతీరాణి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పాటించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎమ్మెల్సీ ఎన్నికల నియమ నిబంధనలు పూర్తిగా తెలుసుకోవాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 430 మంది ఓటర్లు ఉన్నారని భీమవరం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం పోలింగ్ కేంద్రంలో 201 మంది ఓటర్లు, నరసాపురం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ కేంద్రంలో 229 మంది ఓటు హక్కు వినియోగించుకుంటారని తెలిపారు. ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీలకు అందించామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి గురించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం అందరూ నడుచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. సమావేశంలో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, డీఆర్వో కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాట్ల పరిశీలన

సాక్షి, భీమవరం: ప్రకాశం చౌక్‌లో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ కాంస్య విగ్రహ పనులను మంగళవారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పరిశీలించారు. పనులు వేగంగా చేయాలని ఆదేశించారు.

19న బాడీ బిల్డింగ్ పోటీలు

సాక్షి, భీమవరం: రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలను ఈనెల 19వ తేదిన భీమవరంలో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ తాత్కాలిక కార్యదర్శి షేక్ ఖాసీం మంగళవారం తెలిపారు. పట్టణంలోని చినరంగనిపాలెంలో గల పీసీఆర్ ఫ్రైడ్స్ వేదిక వద్ద పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని అన్నారు. విజేతలు మధ్యప్రదేశ్‌లో మార్చి 4, 5 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని అన్నారు.

పాఠశాలల తనిఖీ క్షుణ్ణంగా చేపట్టాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పాఠశాలల తనిఖీల్లో అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో నాడు–నేడు పనులు, పాఠశాల తనిఖీలకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఈఓలు పాఠశాల తనిఖీ సందర్భంలో అన్ని అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. పాఠశాలల తనిఖీలలో నిర్లక్ష్యం కనిపిస్తుందని, అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండో విడత నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. టాయిలెట్లకు కేటాయించిన నిధులు కాంపౌండ్ వాల్‌కు వినియోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సొంతింటి కలకు డ్వాక్రా సాయం

- జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు అదనపు ప్రయోజనం
- స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రూ.35 వేల సాయం
- ఏలూరు, పశ్చిమగోదావరిలో రూ.260.65 కోట్ల రుణం



దెందులూరు మండలంలో హౌసింగ్ డే సందర్భంగా అవగాహన కల్పిస్తున్న దృశ్యం(ఫైల్)

ఏలూరు (టూటౌన్): జగనన్న ఇళ్లతో రాష్ట్రంలో లక్షలాది మంది సొంతింటి కల సాకారమైంది. ఇప్పటికే అర్హులైన పేదవారికి జగనన్న ఇళ్ల కాలనీల్లో స్థలాలు కేటాయించి గృహనిర్మాణ శాఖ ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఆ మొత్తానికి అదనంగా సబ్సిడీపై ఇసుక, ఐరన్, సిమెంటు వంటి నిర్మాణ సామగ్రిని అందిస్తున్నారు. దీనికి తోడు స్వయం సహాయక సంఘాలలో ఉండే మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.35 వేల అదనపు రుణం సమకూరుస్తున్నారు. దీనిపై 6 శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వమే చెల్లించడం కొసమెరుపు. బ్యాంకులు ఇచ్చే రుణ మొత్తాన్ని 36 సులభ వాయిదాలపై చెల్లించే వెసులుబాటు కల్పించారు. కేవలం పావలా వడ్డీ మాత్రమే చెల్లించేలా అవకాశం కల్పించారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో 74,472 మందికి రుణాలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 74,472 మంది డ్వాక్రా మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.35 వేల చొప్పున ఇంతవరకూ రూ.260.65 కోట్లు అందించారు. దీంతో జగనన్న ఇంటి లబ్ధిదారులు తమ సొంతింటి కలను సాకారం చేసుకోగలుగుతున్నారు.

పశ్చిమలో రూ.145.73 కోట్ల రుణాలు

పశ్చిమగోదావరి జిల్లాలోని 19 మండలాల పరిధిలో 47,830 మంది జగనన్న ఇళ్ల లబ్ధిదారులు డ్వాక్రా సంఘాలలో ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 41,919 మందికి రుణాలు అందించాలనే లక్ష్యానికి గాను ఇంతవరకూ 41,636 మందికి రూ.145.73 కోట్లు ఇంటి నిర్మాణం కోసం రుణాలుగా అందించారు.

ఏలూరు జిల్లాలో రూ.114.92 కోట్లు అందజేత

ఏలూరు జిల్లా వ్యాప్తంగా జగనన్న లబ్ధిదారులు డ్వాక్రా సంఘాలలో 59,514 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఇంతవరకూ 32,836 మందికి ఒక్కొక్కరికి రూ.35 వేలు చొప్పున మొత్తం రూ.114.92 కోట్లు బ్యాంకుల ద్వారా అందించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మరింత మందికి రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

అదనపు సాయం ప్రయోజనకరం



పెదపాడు మండలం కలపర్రుకు చెందిన మందా శిరీషకు ఇంటి నిర్మాణం కోసం అదనపు సాయంగా రూ.35 వేలు డ్వాక్రా గ్రూపు ద్వారా ఇవ్వడంతో నిర్మాణంలో ఎంతో కొంత ఉపయోగపడింది. నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సాయంతో పాటు బ్యాంకుల ద్వారా అదనపు సాయం అందజేస్తున్న ముఖ్యమంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తన సొంతింటి కల ముఖ్యమంత్రి సహకారంతో సాకారం చేసుకోగలిగింది.

100 శాతం లక్ష్యం పూర్తి చేసేలా కృషి



పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో జగనన్న ఇంటి లబ్ధిదారులకు అదనంగా బ్యాంకుల ద్వారా రూ.35 వేల రుణం 100 శాతం మందికి అందించేలా పనిచేస్తున్నాం. త్వరలోనే నూరు శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం.

-ఎంఎస్ఎస్ వేణుగోపాల్, పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పశ్చిమగోదావరి జిల్లా

లబ్ధిదారుల్లో స్పందన బాగుంది



జగనన్న ఇంటి లబ్ధిదారులకు గృహనిర్మాణ శాఖ అందించే ఆర్థిక సాయానికి తోడు అదనంగా బ్యాంకుల ద్వారా రూ.35 వేలు రుణ సదుపాయాన్ని కల్పిస్తుండటంతో లబ్ధిదారుల్లో మంచి స్పందన ఉంది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఇంతవరకూ డ్వాక్రా సంఘాలలోని 32,836 మంది ఇంటి నిర్మాణాలకు ఆర్థిక సాయం అందించాం.

– ఆర్.విజయరాజు, పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఏలూరు జిల్లా


ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే గ్రంధి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు చెబుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నియోజవర్గంలో పలు అభివృద్ధి పనులు నిమిత్తం నిధుల మంజూరుకు సంబంధించి ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెల్లడించారు. యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిమిత్తం రూ.36.28 కోట్లు నిధులు మంజూరు కాగా ఇటీవల ఆర్థిక శాఖ కూడా అనుమతి ఇవ్వడంతో త్వరలోనే టెండర్లు పిలవనున్నారని అన్నారు. తాడేరు వంతెన నిర్మాణానికి సంబంధించి త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. గునుపూడి లేఅవుట్‌లో 75 ఎకరాల భూమి పూడికకు నిధులు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి సంబంధిత ఉన్నత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. డంపింగ్ యార్డ్ సమస్య త్వరలోనే పరిష్కారం కానుందని పేర్కొన్నారు. 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణానికి మరో రూ.23 కోట్ల నిధులను మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని చెప్పారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు ముమ్మరం



గోదావరిలో ఏర్పాటు చేస్తున్న ప్లాట్‌ఫాం

పోలవరం రూరల్: పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 18వ తేదీ శనివారం శనిత్రయోదశి పర్వదినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులు కాలినడనక వెళ్లి వచ్చేందుకు వీలుగా చలువ పందిళ్లు, క్యూలైన్‌లు, టిక్కెట్ కౌంటర్‌లు, ప్లాట్‌ఫాంలు ఏర్పాటుచేశారు. నదిలో దాటి వెళ్లేందుకు వీలుగా 6 పంట్లతో ప్లాట్‌ఫాం తయారు చేస్తున్నారు. క్షేత్రం వైపు కొంతభాగం ఇసుకతో ర్యాంపు నిర్మిస్తున్నారు. ఇసుక తిన్నెలపై చలువ పందిళ్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. తాగునీటి సౌకర్యం కోసం చేతి పంపు నిర్మాణం పనులు చేపట్టారు. తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులను తాటాకులతో నిర్మిస్తున్నారు. నది ఒడ్డున స్నానాలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. శివక్షేత్రం వద్ద రూ. 300, రూ. 50, రూ. 20, ఉచిత దర్శనం క్యూలైన్‌లు దిగువ నుంచి ఏర్పాటు చేశారు. క్షేత్రం వద్ద మొత్తం నీడకోసం షామియానాలతో నిర్మాణం చేపట్టారు. క్యూలైన్‌లో మంచినీటి సరఫరా, ఫ్యాన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో సంగమేశ్వర శర్మ తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భవ సమయంలో భక్తులు దర్శనానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాత్కాలిక బస్టాండ్‌లు, వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ ప్లేస్‌లు కేటాయించారు. ఉత్సవ ఏర్పాట్లను డీఎస్పీ కె.లతాకుమారి, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఎస్సై పవన్‌కుమార్‌లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇస్తున్నారు.

బలివేకు 24 బస్సుల ఏర్పాటు

నూజివీడు: శివరాత్రిని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ముసునూరు మండలం బలివేకు 24 బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సీహెచ్ ఎస్.పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. శివరాత్రికి నూజివీడు, ముసునూరు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు బలివేకు వెళ్లి స్వామివారిని దర్శించుకోనున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం ఈ బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 17న సాయంత్రం నుంచి 19వ తేదీ ఉదయం వరకు ఈ సర్వీసులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఏలూరు నుంచి కొప్పాక, వేల్పుచర్ల ల మీదుగా బలివేకు బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు.

రథసారథుల్లా పనిచేయాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



భీమవరంలో గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి, వేదికపై ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో గత మూడున్నరేళ్లగా చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి మరోసారి జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. భీమవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మంగళవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ మండల కన్వీనర్లు, గృహ సారథులు వైఎస్సార్‌సీపీ రథసారథులుగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయడంతో పాటు అర్హులైనవారందరికీ నవరత్న పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో నారా చంద్రబాబునాయుడు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్లనే 2019 ఎన్నికల్లో టీడీపీని 23 సీట్లకే పరిమితం చేశారని నాగేశ్వరరావు వివరించారు. చంద్రబాబు హయాంలో టీడీపీ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరగా జగనన్న పాలనలో అణగారిన అన్ని వర్గాలకు కుల, మత, రాజకీయాలకు అతీతంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వం– లబ్ధిదారుల మధ్య దళారీ వ్యవస్థ లేకుండా చేయడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘనతన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయిలో తెలియజేయాలని మంత్రి కోరారు. పార్టీ కోసం కష్టపడేవారందరికీ తగిన గుర్తింపు లభిస్తుందని భీమవరం నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే శ్రీనివాస్ పడుతున్న కష్టం ప్రశంసనీయమన్నారు.

15 వేల మందికి ఇళ్ల స్థలాలు

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ కన్వీనర్లు, గృహసారథులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు కలిసికట్టుగా పనిచేసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మంచి పేరు తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలో సుమారు 15 వేల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని అన్నిచోట్ల వేగంగా గృహనిర్మాణాలు సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును ప్రజలకు వివరించడంతోపాటు తెలుగుదేశం, జనసేన అభివృద్ధిని అడ్డుకుంటున్న విధానాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గామల్లేశ్వరరావు(బాబు), ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పార్టీ నాయకులు కోమటి రాంబాబు, కొట్టి కుటుంబరావు, కోళ్ల బాలకృష్ణ, చిల్లే వెంకటేష్, రాట్నాల స్వామి, కేతా నాగబాబు, జల్లా కొండయ్య, తిరుమాని తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి కొండపై అవుట్‌పోస్ట్ ప్రారంభం



శ్రీవారి కొండపై టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ద్వారకాతిరుమల: టూరిస్ట్ పోలీస్‌తో పర్యాటకులకు విస్తృత సేవలు అందించనున్నట్లు ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ తెలిపారు. రాష్ట్రంలో తొలివిడతగా 20 పర్యాటక కేంద్రాల్లో ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్టులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా మంగళవారం ఉదయం ప్రారంభించారు. అందులో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్టు శిలాఫలకాన్ని ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యాటకుల భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం టూరిస్ట్ పోలీస్‌ను ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవుట్ పోస్టులో మూడు షిఫ్టులుగా ఆరుగురు సిబ్బంది 24 గంటలూ విధులు నిర్వర్తిస్తారని, ప్రతి షిఫ్టులో ఇద్దరు ఉంటారన్నారు. పలు ప్రాంతాల నుంచి క్షేత్రానికి వచ్చే యాత్రికులకు ఏదైనా సమాచారం కావాలన్నా, ఇబ్బంది కలిగినా, ఎవరైనా తప్పిపోయినా, దొంగతనాలు జరిగినా, ఎవరైనా వేదించినా టూరిస్ట్ పోలీసులు త్వరితగతిన స్పందిస్తారన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌తో అనుసంధానమై సంబంధిత ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తారన్నారు. శ్రీవారి ఆలయానికి భవిష్యత్తులో భద్రతను పెంచుతామని, ప్రస్తుతం క్షేత్రంలో 145 సీసీ కెమేరాలు ఉన్నాయన్నారు. త్వరలో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు, భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావు, ద్వారకాతిరుమల, భీమడోలు ఎస్సైలు టి.సుధీర్, సురేష్, అవుట్‌పోస్టు ఎస్సై ఆంజనేయులు, కమ్యూనికేషన్ ఇన్స్‌పెక్టర్ పి.వి జయ్‌కుమార్, ఐటీ నరేంద్ర(ఎస్సై), సి.రాంప్రసాద్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలోని దుర్గాపురం 1, 2 ,కొవ్వాడ అన్నవరం, శివరావుపేట 1 సచివాలయాల్లో జిల్లా జాయింట్ కలెక్టరు జేవీ మురళి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సేవలను నిరుపేదల ఇంటివద్దకు తీసుకువెళ్లేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని, ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చే దిశగా సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి జాబితాలను పథకాల వారీగా నోటీసు బోర్డులో ఉంచాలని, అదేవిధంగా అనర్హుల జాబితాలను కూడా నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. ప్రతీ రోజు సచివాలయం పరిధిలో స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించాలని, వాటిని అదేరోజు సంబంధిత శాఖల అధికారుల పరిష్కారం నిమిత్తం పంపించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని అందించాలన్నారు. సచివాలయం ఉద్యోగులు, వార్డు వలంటీర్లు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. శాఖల వారీగా సచివాలయం ఉద్యోగులను వర్క్ ప్లాన్ అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా పరిష్కరించే స్థాయిలో ఉండాలని చెప్పారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

కలెక్టర్ పి.ప్రశాంతి



యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెం జగనన్న కాలనీలో మాట్లాడుతున్న కలెక్టర్ పి ప్రశాంతి

యలమంచిలి: జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల మనోభావాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. అబ్బిరాజుపాలెం జగనన్న కాలనీ, నక్కాపాలెం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో గృహనిర్మాణ పథకంపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నా ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకోకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. యలమంచిలి మండలంలో 47 జగనన్న కాలనీలు ఉండగా 17 కాలనీల్లో ఒక్క ఇల్లు కూడా ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం పొందిన ప్రతి లబ్ధిదారుడిని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది కలుసుకుని వారి ఇబ్బందులను తెలుసుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మూడవ ఆప్షన్ కింద మనమే ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అప్పటికీ లబ్దిదారులు ముందుకు రాకపోతే పట్టా రద్దు చేసి కొత్తవారికి ఇద్దామన్నారు. లే అవుట్‌లలో అనుకూలంగా ఉన్న ప్రదేశాలలో ఇటుక యూనిట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ముందుగా అబ్బిరాజుపాలెం పంచాయతీ నక్కాపాలెంలో ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆమె సందర్శించారు. ఈ పాఠశాలకు కొత్త భవనం మంజూరు కాగా ప్రస్తుతం పాఠశాల ఉన్న స్థలంలోనే నిర్మించాలని కొందరు, దాతలు ఇచ్చిన మరొక స్థలంలో నిర్మించాలని ఇంకొందరు ఫిర్యాదులు చేయడంతో పాఠశాల ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం పాఠశాల ఉన్న స్థలం చిన్నదిగా ఉండడంతో ఇక్కడ నిర్మించడం సాధ్యంకాదని ఆమె చెప్పారు. ఆమె వెంట స్థానిక సర్పంచ్ కామిశెట్టి సాయిబాబా, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పిచ్చయ్య, తహసీల్దార్ లక్కు నరసింహారావు, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, హౌసింగ్ డీఈ రామాయణం త్రిమూర్తులు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మట్టి రవాణాపై తనిఖీలు



కాళ్లలో మట్టి లారీలను తనిఖీ చేస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలో మట్టి రవాణా చేస్తున్న లారీలను మైనింగ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.సునీల్‌బాబు మాట్లాడుతూ మట్టి రవాణాలో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రభుత్వ అవసరాలకు మట్టిని తరలించినా అనుమతులు తప్పనిసరి అన్నారు. కాళ్లలో మట్టి తరలిస్తున్న లారీలను తనిఖీ చేసి బిల్లులు, అనుమతులను పరిశీలించారు. ఈయన వెంట రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు కేవీ రమణ ఎస్‌కే ఆషియా, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ నిరోధానికి కళాశాలల్లో నిఘా

- కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్
- మాదక ద్రవ్యాల నియంత్రణపై అధికారులతో సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రతి కళాశాలలోనూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నషా ముక్త్ భారత్ కార్యక్రమానికి సంబంధించి సమన్వయ సమావేశంలో మాదకద్రవ్యాల నియంత్రణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని సమాజం నుంచి కూకటివేళ్లతో సహా నిర్మూలించేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ చర్యలు తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించేందుకు ఆయా పాఠశాలలు, కళాశాలల్లోని ఉపాధ్యాయులు, అధ్యాపకులతో నిఘా బృందాన్ని ఏర్పాటు చేసి, మాదకద్రవ్యాలు సరఫరా కాకుండా విద్యార్థులెవ్వరూ మాదకద్రవ్యాల బారిన పడకుండా చూడాలన్నారు. మాదకద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలపై ఫ్లెక్సీల ద్వారా ప్రచారంతో పాటు అవగాహనా సమావేశాలు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మాదక ద్రవ్యాలు తీసుకుంటున్న వారిని గుర్తించడమే కాక, వారికి డీ అడిషన్ కేంద్రాలలో చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి మాట్లాడుతూ యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందన్నారు. ఏ ఒక్కరూ మాదక ద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై గ్రామీణ ప్రాంతాలు, అన్ని పాఠశాలలు, కళాశాలల్లో పారా లీగల్ వలంటీర్లతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృపావరం, ఆర్‌ఐఓ.ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తలశిలను పరామర్శించిన ఎమ్మెల్యే ఎలీజా



ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌ను శాసనసభ్యులు ఉన్నమట్ల ఎలీజా మంగళవారం కలిసి పరామర్శించారు. ఇటీవల రఘురామ్ భార్య స్వర్గస్తులయ్యారు. దీంతో ఎలీజా విజయవాడలోని ఆయన నివాసంలో రఘురామ్‌ను మంగళవారం కలిసి పరామర్శించారు.

ఆలయ ఆభరణాల అప్పగింత

ఆకివీడు: స్థానిక మదనగోపాలస్వామి ఆలయంలో చోరీకి గురైన ఆభరణాలు ఎట్టకేలకు మంగళవారం స్వామివారి చెంతకు చేరాయి. 2021 ఏప్రిల్ 25వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఆలయంలో స్వామివారి బంగారు, వెండి వస్తువుల్ని దొంగలు దోచుకున్నారు. అప్పట్లో చోరీపై ఆలయ ఈఓ సాగి శ్రీనివాస రంగరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడు సికింద్రాబాద్‌కు చెందిన 66 ఏళ్ల వృద్ధుడు అంగోత్ నాయక్ (రాములు)ను పట్టుకుని కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు అనంతరం భీమవరంలోని పీజేసీజే కోర్టు జనవరి 5న తీర్పునిస్తూ ఏడాది జైలు శిక్ష, రూ.50 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. కేసుకు సంబంధించి ఆలయానికి చెందిన 4.8 గ్రాముల బంగారం, 4.570 కేజీల వెండి వస్తువుల్ని ఈఓ రంగరాజుకు ఎస్‌ఐ రాజారెడ్డి అందజేశారు.

టాటా మోటార్స్ కారు షోరూం ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని ఉండి రోడ్డులో ఏర్పాటు చేసిన టాటా మోటార్స్ జాస్పర్ ఇండస్ట్రీస్ వారి నూతన కారు షోరూమ్‌ను మంగళవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, సంస్థ చైర్మన్, మాజీ ఎంపీ బడిగ రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. అలాగే నూతన ఎలక్ట్రికల్ కార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆటో మొబైల్ రంగంలో విశిష్ట స్థానం, ప్రాముఖ్యతను జాస్పర్ ఇండస్ట్రీస్ సాధించుకుందని, టాటా కంపెనీ సరసమైన ధరలతో నాణ్యమైన భద్రత కలిగిన వాహనాలు వినియోగదారులకు అందిస్తుండటం అభినందనీయమన్నారు. 1955లో స్థాపించిన సంస్థ నేడు పలు శాఖలతో సుమారు 1800 మంది ఉద్యోగులతో పనిచేస్తోందన్నారు. బడిగ రామకృష్ణ ఆథరైజ్డ్ డీలర్‌గా వాహన యజమానులకు సంతృప్తికర సేవలు అందించడంతో సంస్థను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లారన్నారు. భీమవరంలో ఆధునిక వసతులతో నూతన షోరూమ్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. చైర్మన్ బడిగ రామకృష్ణ మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా ఆటో మొబైల్ రంగంలో, సామాజిక సేవలో ముందు ఉన్నామన్నారు. జాస్పర్ ఉద్యోగుల కోసం వెల్ఫేర్ ఫండ్‌ను కూడా ప్రారంభించామన్నారు. భీమవరం ప్రాంత ప్రజలకు టాటా సంస్థ నుంచి పెట్రోల్, డీజిల్ కార్లతోపాటు ఎలక్ట్రిక్ కార్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సెంట్రల్ జోన్ జోనల్ మేనేజర్ నితుల్ శర్మ, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, గాదిరాజు సుబ్బరాజు, యిర్రింకి సూర్యారావు, గోకరాజు రామరాజు, డైరెక్టర్స్ పీవీ సత్యనారాయణరావు, బడిగ శ్రీదేవి, జీఎం హేమంత్, సురేష్ పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ: పెనుగొండలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్‌ను అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

దాళ్వాకు నీటి ఎద్దడి రానివ్వద్దు

- పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి
- ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం



తణుకులో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: దాళ్వా పంటకు ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా కాలువ నీటిమట్టం తగ్గిన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాల్సిన బాధ్యతను అధికారులు సక్రమంగా నిర్వర్తించేలా కార్యాచరణ చేశారని చెప్పారు. అందులో భాగంగా నీటి కొరత సందర్భంగా సీలేరు రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునే విధంగా అధికారులతో మాట్లాడినట్లు వివరించారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, ఇరగవరం, అత్తిలి, తణుకు మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల ఆయకట్టుకు సంబంధించి ప్రతి ఎకరాకు నీటిని అందించాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి క్రాస్ బండ్‌లు ఏర్పాటుతోపాటు అవసరమైన చోట నీరు తోడకానికి ఎలక్ట్రికల్ మోటార్లు, విద్యుత్ మోటార్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతు కూడా మాకు నీరు అందలేదని అనకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఎటువంటి సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఉన్నా రానున్న నాలుగు రోజుల్లో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. హాజరైన రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపిన విధంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ముందుగానే అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఫోన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ దక్షిణమూర్తి, డీఈ కె.శ్రీనివాస్, ఏఈలు కె.అనిల్‌తేజ, ఎ.బాల మురళీకృష్ణ, కె.శ్రీనివాస్, పి.వివేకానంద, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, బోడపాటి వీర్రాజు పాల్గొన్నారు.

స్కూలు బస్సులో క్షుద్ర పూజలు

చాట్రాయి: ప్రైవేటు స్కూలు బస్సులో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసిన సంఘటన ఇది. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట వికాస్ కాలేజీకి చెందిన బస్సు ప్రతి రోజూ విద్యార్థులను దించి రాత్రి సమయంలో మండలంలోని కృష్ణారావుపాలెం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నిలుపుతున్నారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బస్సు లోపల ముగ్గు వేసి నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, అన్నం ముద్దలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఎప్పటిలాగే విద్యార్థులు కాలేజీకి వెళ్లడానికి బస్సు ఎక్కడంతో చేసిన క్షుద్రపూజలు కనిపించాయి. దీంతో విద్యార్థులు ఆందోళన చెంది యాజమాన్యానికి సమాచారం తెలియచేయడంతో మరో బస్సు ఏర్పాటు చేశారు. ఏది ఏమైనప్పటికి బస్సులో క్షుద్రపూజలు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

సభలు జయప్రదం చేయండి


ఐఎఫ్‌టీయు కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: శ్రీకాకుళంలో ఈ నెల 25,26 తేదీల్లో జరిగే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు మామిడి దానవరప్రసాద్ కోరారు. సభ తాలూకా కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి కింది స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహాసభల్లో గతంలో చేసిన పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తారు. మార్చి ఒకటిన తాడేపల్లిగూడెం ఏరియా మహాసభ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయరాజు, ప్రసాద్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

తాడేపల్లిగూడెం: పట్టణంలో ఆత్మబంధువులు సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన ఉచిత క్యాన్సర్ స్కీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్టు బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక యంత్రాలు కలిగిన మొబైల్ బస్సులో ఈ స్క్రీనింగ్ చేస్తారన్నారు. క్యాంప్‌కు రాదలచిన వారు ఈ నెల 20, 21, 22 ,23 తేదీల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆరు గంటల వరకు మోహన్ స్టూడియోలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: యువతి అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై వీరభద్రరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జగన్నాథపురం గ్రామానికి యువతి (20) హైదరాబాద్‌లో సివిల్ ఇంజనీర్‌గా జాబ్ చేస్తోంది. ప్రస్తుతం ఆమె జగన్నాథపురంలో తన మేనత్త పిట్టా సావిత్రి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఆమె షాపునకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం సావిత్రి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

గృహ సారథులే విజయసారథులు

తాడేపల్లిగూడెం అర్బన్: గృహసారథులే విజయసారథులని టుటౌన్ గృహ సారథుల ఇన్‌చార్జ్ కర్రి భాస్కరరావు పేర్కొన్నారు. మంగళశారం ఆయన స్వగృహంలో 10వవార్డు గృహసారుథులకు శిక్షణా కార్యక్రమాన్ని అడ్డాల నర్సింహరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి భాస్కరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలను అనుసరించి ఈనెల 18 నుంచి 26 వరకు నిర్వహించే ''జగనన్న మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగనన్న'' కార్యక్రమాల ద్వారా గృహ సారథులు, వార్డు కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అలాగే ప్రతి ఇంటికి వెళ్ళి గృహస్తులను పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకొని అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. జగనన్న పథకాలు అర్హులైన వారందరికి పథకాలు అందాయా లేదా, అర్హులుంటే అవసరమైన పథకాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు లబ్ధిని చేకూరుస్తూ జగనన్నన పాలనను తెలియజేయాలన్నారు. తెదేపా పాలనలో జన్మభూమి కమిటీలతో ప్రజలను దోచుకున్న దోపిడితనాన్ని వివరించాలన్నారు. ఇప్పటికే చంద్రబాబును ఎవరూ నమ్మడం లేదని తన కొడుకు లోకేష్‌ను ప్రచారానికి తీసుకువచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు కొల్లి శ్రీనివాస్, అచ్యుత శ్రీనివాస్, ఆలం ధనకొండ, తోట రాము, యలమంచిలి మాధవి, గండిమేలు సుమ, పెనుగొండ సత్యవతి, కాకరపర్తి వరలక్ష్మి, నల్ల మంగతాయారు, రమ్య,చంద్ర, అచ్యుత ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి భాస్కరరావు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 10వవార్డు గృహసారథులు

జవానుల త్యాగం అజరామరం


పుల్వామా వీరులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు


పాతూరు యూత్ సభ్యులు అమరజవానన్లకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: పుల్వామా దాడిలో అసువులు బాసిన జవానుల త్యాగం చిరస్మరణీయమని మంగళవారం వాసవీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎస్‌వి.రమణరావు అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు జవానుల మృతికి నివాళిగా కొంతసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు కొవ్వొత్తులతో నివాళి

తాడేపల్లిగూడెం అర్బన్: 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన మన వీరజవాన్లకు స్థానిక పాతూరు యూత్ సభ్యులు మంగళవారం కొవ్వొత్తులతో నివాళులరి ్పంచారు. పాతూరు సెంటరులో సమావేశాన్ని నిర్వహించారు. అమర జవాన్లను స్ఫూర్తిగా తీసుకొని భారతదేశ సేవకు అంకితమవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాట్ల జగన్నాథరాజు, నల్లకంచు రాంబాబు, సురేషు తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా దాడి హేయమైనచర్య

పెంటపాడు: పుల్వామాదాడిలో ప్రాణాలు పోగొట్టుకొన్న అమరవీరులను దేశం సదా గుర్తుంచుకొంటుందని రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమసంఘ కన్వీనర్ తనబుద్ది భోగేశ్వరరావు పేర్కొన్నారు. అలంపురం గ్రామంలో టీబీఆర్ సైనికస్కూల్లో మంగళవారం పుల్వామాదాడిలో ప్రాణాలు పోగొట్టుకొన్న అమర వీరులను తలస్తూ విద్యార్థులు శ్రద్ధాంజలి ఘటించారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో పుల్వామా దాడి సంఘటనలో ప్రాణాలు పోగొట్టుకొన్న వీరులకు నివాళ్లుఘటించారు. టీబీఆర్ సైనికస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

రామసీతకు అభినందనలు

తాడేపల్లిగూడెం అర్బన్: విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా నియమితులైన కొలుకులూరి రామసీతకు పలువురు నాయకులు మంగళవారం అభినందనలు తెలిపారు. అమ్మవారి దేవస్థానం పాలక మండలి సభ్యురాలిగా ఎంపికవడం అదృష్టమని కొనియాడారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు ఉచిత వైద్యశిబిరాలు, పలు సేవా కార్యక్రమాల ద్వారా పేదలను ఆదుకోవడం ఆదర్శనీయమన్నారు. కొలుకులూరి దంపతులను పుష్పగుచ్చాలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, తదితరులు పాల్గొన్నారు.


కొలుకులూరి ధర్మరాజు, రామసీత దంపతులకు అభినందలు తెలుపుతున్న దృశ్యం

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

సాక్షి, భీమవరం: కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతుల సమస్యలపట్ల కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లు దోచుకుంటున్నారన్నారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు


ఎరువులు, పురుగు మందు దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామంలోని పురుగు మందుల దుకాణాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాకు, రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా లేని కొన్ని మందుల అమ్మకాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. స్టాకు బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలని, రైతులు బిల్లులు పొందాలని ఏడీఏ పి.మురళీకృష్ణ సూచించారు. నిబంధనలను అతిక్రమించి అధిక ధరలకు ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మాధవరం గ్రామంలో వరి చేలను ఏవో ఆర్ఎస్.ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. నాట్లు వేసిన 40 రోజుల తర్వాత కాంప్లెక్స్ ఎరువులు, పొటాష్ వాడొద్దని రైతులకు హితవు పలికారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో ఈ నెల 15, 16వ తేదిల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం జరుగుతుందని, రైతులు వినియోగించుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, వీఏఏలు ఉన్నారు.

ఎరువుల అమ్మకాల్లో ఈపాస్ విధానం పాటించాలి


తణుకులో ఎరువుల షాపులో ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తణుకు టౌన్: ఎరువులు, పురుగుల మందుల డీలర్లు ఈపాస్ విధానాన్ని పాటించాలని కేఏఎస్ఎస్ శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం తణుకు మండలంలోని పలు గ్రామాల్లోని ఎరువుల షాపులను ఆకివీడు వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మంగళవారం తణుకు రూరల్ మండలంలోని దువ్వ, మండపాక, వేల్పూరు, తణుకు పట్టణంలోని పలు ఎరువుల షాపుల్లో ర్యాండ్‌గా రికార్డులను, తూకాలు, ఎరువులను తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మకాలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని చెప్పారు. బిల్లు పుస్తకాలను కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. షాపుల్లో ఎరువుల బస్తాలు సగటున 50.160 కిలోలు ఉన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏవో కే కుసుమ, ఇతర వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం పనుల తనిఖీ


అత్తిలి మండలం కంచుమర్రు గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేస్తున్న దృశ్యం

అత్తిలి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కంచుమర్రు గ్రామంలో చేపట్టిన పనులను జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్టీవీ రాజేశ్వరరావు మంగళవారం తనిఖీ చేసారు. గ్రామంలో జరుగుతున్న వాటర్‌కెనాల్స్ పనుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రతి కూలి తన బ్యాంకు ఖాతాకు ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పనిదినాలు 100 రోజులు దగ్గర ఉన్న కుటుంబాలకు యుద్ధ ప్రాతిపదికన పనిదినాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ తేలి శాంతస్వరూప్‌ను ఆదేశించారు. గ్రామంలో పలువురు మేట్లకు ఎస్ఎంఎంఎస్ హాజరుపై అవగాహన లేకపోవడంపై ప్రాజెక్టు డైరెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ మండల సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, టెక్నికల్ అసిస్టెంట్ నవ్య, శ్రీనివాస్, వీఆర్వో రత్నాకర్, మేట్లు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకపోతే నో ఎంట్రీ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీష్

తణుకు: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకపోతే తణుకు పట్టణంలోకి అనుమతి లేదని తణుకు ట్రాఫిక్ ఎస్సై జానా సతీష్ హెచ్చరించారు. మంగళవారం తణుకు పట్టణంలోని పలు కూడళ్లలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా హెల్మెట్ ధరించకుండా పట్టణంలోకి వచ్చేవారిని వెనక్కు పంపారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగించాలని అవగాహన కల్పిస్తున్నప్పటికీ వాహనదారుల్లో చలనం రావడం లేదని చెప్పారు. ఇకపై హెల్మెట్ ధరించని వారిని పట్టణంలోకి అనుమతించమని అన్నారు. కచ్చితంగా హెల్మెట్ ధరించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటరమణ

తణుకు అర్బన్: విద్యాశాఖకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా ఉపాధ్యాయ యంత్రాంగం కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా రాబోయే పదో తరగతి పరీక్షలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను అందరూ తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. అనంతరం నాడు-నేడు పనుల ప్రగతి, బైజూస్ ట్యాబ్‌ల వినియోగం, నాణ్యమైన విద్య వంటి అంశాలను పవర్ ప్రజంటేషన్ ద్వారా ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎస్‌వీవీ ప్రసాద్, నేలపాటి వెంకట రమణ, డీఆర్‌వీ సత్యనారాయణ, పి.భరణి కుమార్, గూడూరి వరప్రసాద్, రామకృష్ణయ్య, సీహెచ్ సత్యనారాయణ, సాలా వెంకటలక్ష్మి, తోట వరలక్ష్మి, పట్టెం సుజాత పాల్గొన్నారు.

నేటి నుంచి సామూహిక ఎలుకల నిర్మూలన

పెంటపాడు: ఈనెల 15 నుంచి రెండు రోజుల పాటు సామూహిక ఎలుకల నిర్మూన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన పలు గ్రామాలు సందర్శించి రైతులను కలిసారు. మండలానికి 90 కేజీల ఎలుకల మందు వచ్చిందన్నారు. ఈ మందును నూకల్లో కలిపి అన్ని గ్రామాల రైతులకు వీఏఏల ద్వారా అందిస్తామన్నారు. రైతులు సామూహికంగా బొరియలను గుర్తించి ఎలుకల మందు పొట్లాలను కన్నాల్లో వేసుకోవాలన్నారు. ఈ విషయంపై రైతులు సంప్రదించాలన్నారు.

యువత సత్‌ప్రవర్తనతో మెలగాలి

తణుకు టౌన్: దైవ భక్తి, విధేయతతో యువత సత్‌ప్రవర్తన కలిగివుండాలని బిషప్ యం జగ్జీవన్ చెప్పారు. మంగళవారం జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో మానవత నైతికత పై నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో భాగంగా తణుకు శాఖ ఆధ్వర్యంలో తణుకు నరేంద్ర సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవత-నైతికతకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భవానీ పీఠం స్వామీజీ శివరామకృష్ణ స్వామీజీ, జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు కమాలుద్దీన్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్య సేవలు చిరస్మరణీయం

తణుకు టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం (సేవా స్థంబ్) జిల్లా అధ్యక్షుడు డా.బొడ్డు విక్టర్ బాబు చెప్పారు. మంగళవారం దామోదరం సంజీవయ్య 102వ జయంతి సందర్భంగా తణుకులోని సేవా స్థంబ్ జిల్లా కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు మొదటి దళిత ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ మంత్రి పదవులు నిర్వహించి పేదల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సేవా స్థంబ్ ఉపాధ్యక్షుడు ఎస్ జయరాజు, కార్యదర్శి జీఎస్ దత్తు, కోశాధికారి బండి ప్రసాద్, గుబ్బల శ్రీనివాసరావు, బీజేఐ రాజు, బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.